మనం
హైదరాబాద్
రంగారెడ్డి | మేడ్చల్
గురువారం | 23 | ఏప్రిల్ | 2026 పేజీలు: 6



# చెరువుల సుందరీకరణకు చర్యలు వేగం

సికింద్రాబాద్, ఏప్రిల్ 22 (మనం న్యూస్) ఉప్పల్ నియోజకవర్గంలోని నాచారం డివిజన్లో తీవ్రంగా మారిన దోమల సమస్యకు పరిష్కారంగా చెరువుల సుందరీకరణకు చర్యలు వేగం అందుకున్నాయి. గుర్రపుడెక్క, వ్యర్థ రసాయన జలాలతో నిండిన చెరువుల కారణంగా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఇప్పటికే రూ.30 కోట్లతో హెచ్ఎంటీ నగర్ పెద్ద చెరువు అభివృద్ధి పనులకు నిధులు మంజూరై, త్వరలో పనులు ప్రారంభం కానున్నాయి. అలాగే పటేల్ కుంట చెరువును సుందరీకరించేందుకు హైడ్రా కార్యాలయంలో హైడ్రా కమిషనర్ రంగనాథ్ను కలిసి విన్నవించారు. త్వరలో పనులు చేపడతామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సాయి జెన్ శేఖర్ పాల్గొన్నారు.



# డిపోకే పరిమితమైన బస్సులు

2

128 బస్సులకు విశ్రాంతి

మేడ్చల్ బస్ డిపోకు ఒక రోజు రూ. 22 లక్షల నష్టం

సమ్మెలోకి 650 మంది ఆర్టీసీ కార్మికులు

# బస్సు ఎక్కితే బేజారే!

- అంతర్రాష్ట్ర దొంగల ముఠా గుట్టురట్టు
- 6 తులాల బంగారం, 61 మొబైల్స్ స్వాధీనం
- నిందితుల్లో ఇద్దరు మైనర్లు.



చేవెళ్ల, ఏప్రిల్ 22 (మనం న్యూస్): బస్సు ప్రయాణికులను నిలువునా ముంచేస్తున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠా ఆటను చేవెళ్ల పోలీసులు కట్ చేశారు. ప్రయాణికుల ఏమరపాటును ఆసరాగా చేసుకుని చేతివాటం ప్రదర్శించే ఈ ముఠాను చాకచక్యంగా పట్టుకున్నారు. వారి వద్ద నుండి భారీగా సొత్తును స్వాధీనం చేసుకున్నారు.

## రైతు ఫిర్యాదుతో కదిలిన యంత్రాంగం

దూసకల్ గ్రామానికి చెందిన వెంకటయ్య అనే రైతు బస్సులో వెళ్తుండగా, కిలేడీలు కన్నుగప్పి ఆరు తులాల బంగారాన్ని కాజేశారు. బాధితుడు పోలీసులను ఆశ్రయించడంతో రంగంలోకి దిగిన పోలీసులు ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టారు. ప్రతాపసింగారం వద్ద నిందితులను సినిమా ఫక్కీలో వెంబడించి బేడీలు వేశారు.

6 తులాల ఆభరణాలు, 61 స్మార్ట్ఫోన్లు,ఒక కారు, రెండు బైకులు నిందితులనుండి స్వాధీనం చేసుకున్నారు.

పట్టుబడిన వారిలో నలుగురు నిందితులతో పాటు ఇద్దరు మైనర్లు కూడా ఉండటం గమనార్హం. మరో నలుగురు పరారీలో ఉన్నట్లు ఏసీపీ బి. కిషన్ తెలిపారు. ఈ ముఠాకు కర్ణాటక, సికింద్రాబాద్లలో కూడా పాత నేరాల చరిత్ర ఉందని, వీరు పక్కా స్కెచ్తో అంతర్రాష్ట్ర స్థాయిలో దొంగతనాలకు

-మిగతా 2లో

# సైబర్ నేరాలపై అవగాహన

సైబర్ నేరాలకు గురైన వెంటనే పోలీసులను సంప్రదించాలి

2





# బస్సు ఎక్కితే బేజారే!

**మొదటి పేజీ తరువాయి**

పాల్పడుతున్నారని విచారణలో తేలింది.బస్సు ప్రయాణాల్లో, రద్దీ ప్రదేశాల్లో ప్రజలు తమ నగలు, ఫోన్ల పట్ల అత్యంత జాగ్రత్తగా ఉండాలి. ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే 100కు సమాచారం ఇవ్వాలని చేవెళ్ల ఏసీపీ కిషన్ తెలిపారు.



## ఆర్టీసీ ఉద్యోగుల డిమాండ్లను వెంటనే పరిష్కరించాలి: ఎమ్మెల్యే

సికింద్రాబాద్, ఏప్రిల్ 22 (మనం న్యూస్) ఆర్టీసీ ఉద్యోగుల డిమాండ్లను వెంటనే పరిష్కరించి సమ్మెను విరమింపచేయాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం సనత్నగర్ నియోజకవర్గం లోని ఐడిహెచ్ కాలనీలో మీడియాతో మాట్లాడిన ఆయన, ఎలక్ట్రిక్ బస్సుల పేరుతో ఉద్యోగ భద్రతను ప్రమాదంలోకి నెట్టుతున్నారని విమర్శించారు. అవసరమైన శిక్షణ ఇచ్చి ఆర్టీసీ ఉద్యోగులకే ఎలక్ట్రిక్ బస్సుల్లో అవకాశాలు కల్పించాలని సూచించారు. ప్రైవేట్ నియామకాలు, ఆర్టీసీ ఆస్తుల అప్పగింతపై ప్రశ్నలు లేవనెత్తారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే సమ్మెకు దిగాల్సి వచ్చిందని పేర్కొన్నారు. సమ్మె కారణంగా విద్యార్థులు, ఉద్యోగులు, సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మహిళలకు ఉచిత ప్రయాణం ప్రకటించిన ప్రభుత్వం, ప్రస్తుతం వారికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కోరారు.

# డిపోకే పరిమితమైన బస్సులు

**128 బస్సులకు విశ్రాంతి**

**మేడ్చల్ బస్ డిపోకు ఒక రోజు రూ. 22 లక్షల నష్టం**

**సమ్మెలోకి 650 మంది ఆర్టీసీ కార్మికులు**




మేడ్చల్, ఏప్రిల్ 22 ( మనం జిల్లా ప్రతినిధి): ఆర్టీసీలో సమ్మె సైరన్ మోగడంతో మేడ్చల్ బస్ డిపోలో బస్సులు డిపో కే పరిమితమయ్యాయి. దాదాపు 128 బస్సులు డిపో కే పరిమితం కాగా 650 మంది కార్మికులు సమ్మె బాట పట్టారు. దీంతో బస్సులు బస్ డిపోకే పరిమితమయ్యాయి. బస్సులు బంద్ కావడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. బస్టాండ్ లో బస్సుల కోసం పడి కాపులు కాస్తున్నారు. మంగళవారం అర్ధరాత్రి వరకు ఆర్టీసీ అధికారులకు కార్మికుల మధ్య జరిగిన చర్చలు విఫలం కావడంతో ఆర్టీసీ కార్మికులు సమ్మె బాట పట్టారు. తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కారం అయ్యేవరకు సమ్మె కొనసాగుతుంది అంటూ మేడ్చల్ ఆర్టీసీ జేఏసీ నేతలు పేర్కొంటున్నారు. ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని, రెండు 2021 వేతన సవరణ 30 శాతం ఫిట్మెంట్ తో అమలు చేయాలని, 2025 వేతన సవరణ అమలు చేయాలని డిమాండ్ చేశారు. మహాలక్ష్మి పథకం కింద ప్రభుత్వం ఇవ్వాల్సిన డబ్బులు 400 కోట్లు ఆర్టీసీకి ఇవ్వాలని ఆర్టీసీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, ట్రేడ్ యూనియన్ లపై ఆంక్షలు ఎత్తివేసి గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని, ఆర్టీసీ ఉద్యోగులపై పని భాగాలు తగ్గించాలని, మహిళా కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆర్టీసీ కార్మికులు సమ్మెకు దిగారు. బస్సులన్నీ డిపోకే పరిమితం కావడంతో మేడ్చల్ డిపో ముందు పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.



# సైబర్ నేరాలపై అవగాహన

సికింద్రాబాద్, ఏప్రిల్ 22 (మనం న్యూస్) పద్మారావు నగర్లోని ఓ స్టడీ సెంటర్లో చిలకలగూడ ఇన్స్పెక్టర్ వలిశెట్టి రామకృష్ణ, డీఐ ఎల్. మధు బాబు, ఎస్సై పి. నాగరాజు ఆధ్వర్యంలో విద్యార్థులకు సైబర్ క్రైమ్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు ఆన్లైన్ మోసాలు, ముఖ్యంగా ఓటీపీ ఫ్రాడ్స్పై విపులంగా అవగాహన కల్పించారు. డిజిటల్ భద్రత కోసం బలమైన పాస్వర్డ్లు ఉపయోగించడం, అనుమానాస్పద లింకులు, కాల్స్, సందేశాలపై జాగ్రత్తగా ఉండాలని సూచించారు. సైబర్ నేరాలకు గురైన వెంటనే పోలీసులను సంప్రదించాలని తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి వ్యక్తిగత సమాచారాన్ని రక్షించుకోవడం అత్యంత అవసరమని అధికారులు పేర్కొన్నారు.



# మల్లికార్జున ఖర్గే దిష్టిబొమ్మ దహనం




మేడ్చల్, ఏప్రిల్ 22 ( మనం జిల్లా ప్రతినిధి ): దేశ ప్రధాని నరేంద్ర మోదీ పై కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వ్యాఖ్యలపై నిరసనగా మేడ్చల్ లో బిజెపి నేతలు మల్లికార్జున ఖర్గే దిష్టి బొమ్మ ను దహనం చేశారు. మేడ్చల్ డివిజన్ అధ్యక్షులు జెల్లీ శైలజ హరినాథ్ ఆధ్వర్యంలో మేడ్చల్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేసి ఖర్గే దిష్టిబొమ్మ దహనం చేశారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే చేసిన వ్యాఖ్యలు అత్యంత అనుచితమని తీవ్రంగా విమర్శించారు. గౌరవ భారత ప్రధానిని ఒక టెర్రరిస్ట్ అని అనడం, వారిని అవమానించడం దేశానికి అవమానకరమని పేర్కొన్నారు. ప్రపంచ దేశాలన్నీ భారతదేశాన్ని గౌరవంతో చూస్తున్న ఈ సమయంలో ఇలాంటి వ్యాఖ్యలు చేయడం తగదని అన్నారు.దీనిపై ప్రతి ఒక్క భారత పౌరుడు స్పందించాలని, ఈ మల్లికార్జున ఖర్గే ను వెంటనే కాంగ్రెస్ అధిష్ఠానం పార్టీ నుండి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు పాతూరి ప్రభాకర్ రెడ్డి, జిల్లా నాయకులు రామన్నగారి శ్రీనివాస్ గౌడ్, చెరువుకొమ్ము శ్రీనివాస్ గౌడ్, ప్రధాన కార్యదర్శి జాకట ప్రేమ్ దాస్,ఉపాధ్యక్షులు మైసరి రాజు,సర్వేశ్వర్ రెడ్డి, కార్యదర్శి బండి విష్ణు మూర్తి,సురేందర్ రెడ్డి,సీనియర్ నాయకులు రాఘవ రెడ్డి,మాజీ సర్పంచ్ మురళీధర్ గుప్తా, నాయకులు వంశీధర్ రెడ్డి,మహేష్,చిర్ల సత్యనారాయణ, నాగరాజు,పద్మ, శ్రీపాల్ రెడ్డి,రతన్ రాథోడ్,సందీప్ రెడ్డి, నవీన్ చారి తదితరులు పాల్గొన్నారు.

# ఇంద్రారెడ్డి ఆశయ సాధనే ధ్యేయం

- మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి
- స్వగ్రామం కౌకుంట్లలో ఘనంగా నివాళులు
- వర్ధంతి వేడుకల్లో పాల్గొన్న కుటుంబ సభ్యులు, అభిమానులు

చేవెళ్ల, ఏప్రిల్ 22 (మనం న్యూస్) : దివంగత మాజీ హోం మంత్రి పట్లోళ్ల ఇంద్రారెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని ఆయన స్వగ్రామమైన కౌకుంట్లలో నివాళులర్పించారు. బుధవారం కౌకుంట్ల లోని ఇంద్రారెడ్డి సమాధి వద్ద మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి పుష్పగుచ్ఛాలు ఉంచి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ.. ఇంద్రారెడ్డి గారు పేదల సంక్షేమం కోసం నిరంతరం తపించేవారని, ఆయన ఆశయ సాధనే ధ్యేయంగా తాము ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. ప్రజల గుండెల్లో ఆయన చిరస్థాయిగా నిలిచిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. భర్త స్మృతిలో ఆమె కాసేపు భావోద్వేగానికి లోనయ్యారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులతో పాటు పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు, అభిమానులు, గ్రామస్థులు పాల్గొని ఇంద్రారెడ్డి సేవలను స్మరించుకున్నారు.





# థలసేమియా బాధితులకు అండగా మెగా ఉచిత వైద్య శిబిరం, రక్తదాన శిబిరం విజయవంతం

కాప్రా, ఏప్రిల్ 22 (మనం న్యూస్): థలసేమియా బాధితులకు తోడ్పాటుగా సర్వ్ హ్యూమానిటీ - సేవ్ లైఫ్ సందేశంతో ప్రశాంత్ కార్తీ పీపుల్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కాప్రా తహసీల్ కార్యాలయంలో బుధవారం మెగా ఉచిత వైద్య శిబిరం, రక్తదాన శిబిరం ఘనంగా నిర్వహించారు. పేదలకు సహాయం చేసి ప్రాణాలను కాపాడాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో సుప్రజ హాస్పిటల్స్ మరియు ధన్వూరి హాస్పిటల్ సౌజన్యంతో థలసేమియా బాధితులకు, స్థానిక ప్రజలకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. టుడీ ఎకో టెస్ట్, ఈసీజీ, బీపీ చెక్అప్ వంటి పలు వైద్య సేవలను అందించి, అనంతరం అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. రక్తదాన శిబిరానికి యువత ఉత్సాహంగా ముందుకు వచ్చి సేవాభావాన్ని చాటారు. ఈ కార్యక్రమంలో రామగుండం శాసనసభ్యులు రాజ్ ఠాగూర్ ముఖ్య అతిథిగా పాల్గొని సేవా కార్యక్రమాన్ని అభినందించారు. కాప్రా మండల తహసీల్దార్ బైరెడ్డి రాజేష్, జవహర్ నగర్ ఎస్‌టీటీ సీఐ జానయ్య, రమేష్ యాదవ్ తదితరులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



అలాగే ఫౌండేషన్ సభ్యులు సర్వాణి దుర్గాప్రసాద్, నరేష్ రెడ్డి, మధు గౌడ్, అనిల్ నారాయణ, అవినాష్, చందు, కిరణ్, వంశీ, విగ్నేష్ తదితరులు పాల్గొని సేవా కార్యక్రమానికి తమ వంతు సహకారం అందించారు. కాలనీవాసులు కూడా పెద్ద సంఖ్యలో హాజరై శిబిరాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, ఇటువంటి సేవా కార్యక్రమాలు సమాజానికి ఎంతో మేలు చేస్తాయని, భవిష్యత్తులో కూడా మరిన్ని ఆరోగ్య శిబిరాలను నిర్వహిస్తామని తెలిపారు.





# ఘనంగా జాతీయ భూమి దినోత్సవం

మేడ్చల్, ఏప్రిల్ 22 ( మనం జిల్లా ప్రతినిధి): మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ లో గల సీనియర్ సిటిజన్ భవనంలో ఘనంగా జాతీయ దినోత్సవాన్ని నిర్వహించారు. ఇందులో జాగృతి సంస్థ అధ్యక్షురాలు శివపార్వతి లోక్ సత్తా నాయకులు రవీందర్ పర్యావరణ ప్రేమికుడు కోల రవీందర్ ముదిరాజ్, ఉప్పల భాస్కర్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణ విషయంలో జాగ్రత్త తీసుకోవాలని, ప్లాస్టిక్ కవర్లు వాడవద్దని నీటిని సంరక్షించాలని, ప్రతి ఇంట్లో ఇంకుడు గుంతలు ఉండాలని రెండు మొక్కలు నాటాలని సూచించారు. కోల రవీందర్ ముదిరాజ్ మాట్లాడుతూ సీనియర్ సిటిజనంతా మీ మీ మనుమలకు మనుమరాలకు పర్యావరణ పై అవగాహన కల్పిస్తూ ప్లాస్టిక్ వాడొద్దని పిల్లలకు చెప్పాలని సూచించారు.వ్యవసాయంలో రసాయనిక మందులు వాడవద్దని సేంద్రీయ ఎరువులు వాడాలని తెలిపారు. పెద్దలందరూ కూడా ప్లాస్టిక్ కు దూరం ఉంటామని ప్రమాణం చేసినారు.

# ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

**14, 15 వార్డుల్లో దోమల మందు పిచికారీ.**
**మున్సిపల్ చైర్పర్సన్ దేవర సమతా వెంకట్రెడ్డి.**

చేవెళ్ల, ఏప్రిల్ 22 (మనం న్యూస్) :చేవెళ్ల మున్సిపాలిటీని ఆరోగ్యవంతమైన మున్సిపాలిటీగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని మున్సిపల్ చైర్పర్సన్ దేవర సమతా వెంకట్ రెడ్డి అన్నారు. బుధవారం '99 ప్రణాళిక'లో భాగంగా పట్టణంలోని 14, 15 వార్డుల్లో దోమల నివారణకు ముమ్మరంగా ఫాగింగ్ (మందు పిచికారీ) చేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె పారిశుద్ధ్య పనులను స్వయంగా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా చైర్పర్సన్ మాట్లాడుతూ.. వర్షాకాలం దృష్ట్యా దోమల వల్ల వ్యాపించే డెంగ్యూ, మలేరియా వంటి ప్రమాదకర వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ప్రతి వార్డులోనూ క్రమం తప్పకుండా దోమల మందు పిచికారీ చేస్తామని, ప్రజలు కూడా తమ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. నీరు నిల్వ ఉండే పాత టైర్లు, డబ్బాలను తొలగించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు బండారి శైలజ ఆగిరెడ్డి, మంగలి కళ్యాణి యాదగిరి, మద్దెల శ్రీనివాస్, మాజీ ఉపసర్పంచ్ టేకులపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.






## ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

మనం న్యూస్/మేడిపల్లి/ ఏప్రిల్ 22: మేడ్చల్ జిల్లా మేడిపల్లి మండలంలో ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడంతోపాటు తమ డిమాండ్లను అంగీకరించాలని  చెంగిచెర్ల డిపో జేఏసి కమిటీ  చైర్మన్ కే.బి.నర్సింహ డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వంతో చర్చలు విఫలమైన నేపథ్యంలో బుధవారం సమ్మెకు దిగిన కార్మికులు చెంగిచెర్ల చౌరస్తా వద్ద ధర్నా నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆర్టీసీ కార్మికులను అన్ని విధాలుగా ఆదుకుంటామని ఆర్టీసీని ప్రభుత్వ రంగంలో విలీనం చేసి ట్రెజరీ ద్వారా శాలరీలు అందజేస్తామని హామీ ఇచ్చారని ఆయన గుర్తు చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ తమ డిమాండ్లను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఆర్టీసీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ  అడిషనల్ చైర్మన్, సత్తయ్యా  కన్వీనర్, బి.రమేష్ కోశాధికారి, సుల్తాన్పూర్షాపైస్ చైర్మన్ రాజు రెడ్డి, మంజుల, తదితరులు పాల్గొన్నారు.

## దామరగిద్దలో ఘనంగా ఇంద్రారెడ్డి వర్ధంతి వేడుకలు

**- 9వ వార్డులో మాజీ హోంమంత్రికి ఘన నివాళి**
**- పేదల పెన్నిధి ఇంద్రన్న అంటూ స్మరించుకున్న అభిమానులు**

చేవెళ్ల, ఏప్రిల్ 22 (మనం న్యూస్) : చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలోని దామరగిద్ద 9వ వార్డులో దివంగత మాజీ హోంమంత్రి పట్లోళ్ల ఇంద్రారెడ్డి వర్ధంతి వేడుకలను బుధవారం అత్యంత ఘనంగా నిర్వహించారు. ఇంద్రారెడ్డి విగ్రహానికి, పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా మండల నాయకులు మాట్లాడుతూ.. తెలంగాణ రాజకీయాల్లో ఇంద్రారెడ్డి  చెరపలేని ముద్ర వేశారని, చేవెళ్ల ప్రాంత అభివృద్ధికి



ఆయన చేసిన కృషి మరువలేనిదని కొనియాడారు. పేద ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం శ్రమించిన గొప్ప నాయకుడని ఆయన్ని స్మరించుకున్నారు. ఇంద్రన్న ఆశయాలను ప్రతి ఒక్కరూ ముందుకు తీసుకువెళ్లాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు పెద్దోళ్ల ప్రభాకర్, బ్యాగరి నరసింహులు, తలారి యాదయ్యా, రామ గౌడ్, అనంత్ రెడ్డి, బిసి సెల్ అధ్యక్షులు రాములు, అభిమానులు  పెద్ద సంఖ్యలో  పాల్గొన్నారు.

# ఎల్లంపేట మున్సిపల్ అధికారుల తీరుపై వినూత్న నిరసన

**మున్సిపల్ కార్యాలయం ముందు కూర్చొని నిరసన తెలిపిన తాళ్లపల్లి రమేష్ గుప్తా**

మేడ్చల్, ఏప్రిల్ 22 ( మనం జిల్లా ప్రతినిధి ): సమాచార హక్కు చట్టం ద్వారా సమాచారం, అడిగిన ఇవ్వకుండా నిర్లక్ష్యం వహించిన ఎల్లంపేట మున్సిపల్ అధికారుల వైఖరిని నిరసిస్తూ ఫోరం ఫర్ ఆర్ టి ఐ హ్యూమన్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు తాళ్లపల్లి రమేష్ గుప్తా వినూత్న నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఎల్లంపేట మున్సిపల్ కార్యాలయం ముందు బైఠాయించి  తన నిరసన తెలిపారు.

డిసెంబర్ లో సమాచారాన్ని కోరిన సమాచారాన్ని, ప్రజా సమాచార అధికారి ఇవ్వనందున ఈ నిరసన చేపట్టినట్లు రమేష్ గుప్తా తెలిపారు. సమాచారం ఇవ్వకుండా, సమాచారాన్ని దాచి పెట్టడం లో ఆంతర్యం ఏమిటో అర్థం కావడం లేదని ఆయన వాపోయారు. ప్రజలకు పారదర్శకంగా ఉండే




అధికారులు, సమాచారాన్ని ఇవ్వకపోవడం లో, అనుమానాలు వ్యక్తమవుతున్నాయని సమాచారాన్ని ఇవ్వకుండా మౌనం పాటించడం ఎందుకు, దీన్న బట్టి చూస్తే, ఎల్లంపేట్ మున్సిపల్ లో అధికారులు ఉన్నట్లా లేనట్లా అనుమానాలు వ్యక్తమవుతున్నాయని తెలిపారు.ప్రతి ఒక్కరికీ, కోరిన సమాచారాన్ని ఇవ్వకపోవడం లో నిర్లక్ష్యం వహిస్తున్న, ఎల్లంపేట్ మున్సిపల్,ప్రజా సమాచార అధికారి,పై  సమాచార హక్కు చట్టం కమీషన్ కు ఫిర్యాదు చేస్తామని, ప్రైవేట్ కోర్టు లో సమాచార హక్కు చట్టం,వల్ల నిర్లక్ష్యం వహిస్తున్న ఎల్లంపేట్ మున్సిపల్, ప్రజా సమాచార అధికారి పై త్వరలో పిటీషన్ దాఖలు చేస్తామని తాళ్లపల్లి రమేష్ గుప్తా పేర్కొన్నారు.




## ఘనంగా ప్రభుత్వ పిఈటి లక్ష్మి దేవి పదవి విరమణ వీడ్కోలు

మేడ్చల్, ఏప్రిల్ 22 ( మనం జిల్లా ప్రతినిధి): ఎల్లంపేట మున్సిపాలిటీ పరిధిలోని శ్రీరంగవరం  గ్రామంలో ఉన్న జెడ్పీహెచ్ ఎస్ ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్న అవంగపురం లక్ష్మిదేవి పదవీ విరమణ కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పీఆర్ టీయూ రాష్ట్ర అధ్యక్షులు పులగం దామోదర్ రెడ్డి,పీఆర్ టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుంకరి బిక్షం గౌడ్,పీఆర్ టీయూ జిల్లా అధ్యక్షులు రామేశ్వర్ గౌడ్,జిల్లా ప్రధాన కార్యదర్శి ఆనంద్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీదేవి,వైస్ చైర్ పర్సన్ మేకల రజితదేవేందర్ రెడ్డిలు హాజరయ్యారు.ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ అవంగపురం లక్ష్మిదేవి వ్యాయమ ఉపాధ్యాయురాలుగా పూడూరు,జీడిమెట్ల, శ్రీరంగవరం గ్రామాల్లోని జడ్పీహెచ్ఎస్ స్కూల్లో వ్యాయామ ఉపాధ్యాయురాలుగా పనిచేశారని గుర్తు చేశారు.అదేవిధంగా ప్రతి ఉద్యోగికి పదవి విరమణ తప్పనిసరని తెలిపారు.వ్యాయామ ఉపాధ్యాయురాలుగా పని చేస్తూ క్రీడల్లో ఎంతో మంది విద్యార్థులను జిల్లా,రాష్ట్ర స్థాయిలో ఎంపికయేందుకు కృషి చేశారని తెలిపారు.విద్యార్థులను శారీకంగా, మానసికంగా తయారు చేయడంలో వ్యాయామ ఉపాధ్యాయురాలు లక్ష్మిదేవి కీలక పాత్ర పోషించారని కొనియాడారు.అనంతరం పలువురు ఉపాధ్యాయులు,పూర్వ విద్యార్థులు శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో పీఆర్ టీయూ మండల అధ్యక్షులు మధుసూదన్ రెడ్డి,ప్రధాన కార్యదర్శి రజిత,హెచ్ ఎం రాజశేఖర్,కౌన్సిలర్లు ఓం ప్రకాష్ గౌడ్,దాది నర్సింహా,చిన్నోళ్ల భాస్కర్,సద్ది సురేష్ రెడ్డి,పూర్వ విద్యార్థులు మాజీ సర్పంచ్ బాబు యాదవ్,శ్రీకాంత్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## మిర్జాగూడలో మహనీయుల జాతర గోడపత్రిక ఆవిష్కరణ

**- ఈనెల 30న వైభవంగా ఉత్సవాలు**
**- విజయవంతం చేయాలని గ్రామస్థుల పిలుపు**

చేవెళ్ల, ఏప్రిల్ 22 (మనం న్యూస్) : మండల పరిధిలోని మిర్జాగూడ గ్రామంలో మహనీయుల జాతర ఉత్సవాల సందడి మొదలైంది. ఈనెల 30వ తేదీన నిర్వహించ తలపెట్టిన ఈ జాతర మహోత్సవానికి సంబంధించిన గోడపత్రికను (పోస్టర్లు) బుధవారం గ్రామ పెద్దలు, యువత కలిసి గ్రామంలో ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఏటా నిర్వహించే ఈ మహనీయుల జాతరను పురస్కరించుకుని ఈ నెల



30న ప్రత్యేక పూజా కార్యక్రమాలు, సాంస్కృతిక వేడుకలు ఉంటాయని తెలిపారు. గ్రామస్తులందరూ ఏకమై ఈ ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకోవాలని, పరిసర ప్రాంతాల భక్తులు కూడా పెద్ద ఎత్తున తరలివచ్చి జాతరను విజయవంతం చేయాలని కోరారు. గోడపత్రిక ఆవిష్కరణ కార్యక్రమంలో గ్రామ కమిటీ సభ్యులు, భక్తులు, యువత అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఈ టిపిఓకు మూడు చోట్ల బాధ్యతలు

**మేడ్చల్ సర్కిల్ టి పి ఓ దుస్థితి ఇది ఎక్కడ న్యాయం చేయలేకపోతున్నారని ఆరోపణలు**

**పూర్తిస్థాయి టిపిఓను నియమించాలని డిమాండ్లు**






మేడ్చల్, ఏప్రిల్ 22 ( మనం జిల్లా ప్రతినిధి): ఏ మున్సిపాలిటీ కానీ, ఏ జిహెచ్ఎంసి కార్యాలయానికి గాని టౌన్ ప్లానింగ్ విభాగం పటిష్టంగా ఉంటేనే పట్టణం అన్ని రంగాలలో పారదర్శకంగా ఉంటుంది. కానీ మేడ్చల్ సర్కిల్ లో మాత్రం టౌన్ ప్లానింగ్ విభాగం అంతంత మాత్రంగానే కనిపిస్తుందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పూర్తిస్థాయి టౌన్ ప్లానింగ్ అధికారి ఉండాల్సిన స్థానంలో ఇంచార్జ్ అధికారుల పాలనలో టౌన్ ప్లానింగ్ విభాగం సాగుతుండడం వల్ల మేడ్చల్ సర్కిల్ తో పాటు ఎల్లంపేట మున్సిపల్ టౌన్ ప్లానింగ్ విభాగం గాడి తప్పిందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. మేడ్చల్ సర్కిల్ కార్యాలయం తో పాటు ఎల్లంపేట మున్సిపల్ కార్యాలయం పరిధిలో జోరుగా అక్రమ కట్టడాలు సాగుతున్న పట్టించుకునే నాథుడే కరువయ్యారు. కమిషనర్ డిప్యూటీ కమిషనర్ ఉన్న వారు అక్రమ కట్టడాల వైపు కన్నెత్తి చూడకపోవడం వల్ల విచ్చలవిడిగా అక్రమ కట్టడాలు సాగుతూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు.

**మేడ్చల్ సర్కిల్ కు పూర్తిస్థాయి టిపిఓ లేక ఇక్కట్లు**

అన్ని రంగాలలో చైతన్యవంతం కలిగిన మేడ్చల్ సర్కిల్ కు పూర్తిస్థాయి టౌన్ ప్లానింగ్ అధికారి లేకపోవడం విడ్డూరంగా ఉంది. నల్లగొండలో టౌన్ ప్లానింగ్ అధికారిగా పనిచేస్తున్న సుకన్య మేడ్చల్ సర్కిల్ కార్యాలయం తో పాటు ఎల్లంపేట మున్సిపాలిటీకి ఇంచార్జ్ బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. మేడ్చల్ సర్కిల్ కార్యాలయానికి రెండు రోజులు, ఎల్లంపేట మున్సిపల్ కార్యాలయానికి ఒక్కరోజు వచ్చి మొహం చూపించి వెళుతుందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

పట్టణంలో ఏమైనా అక్రమ నిర్మాణాలు సాగుతున్నాయా, పట్టణ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలు ఏంటి అంటూ పట్టణంలో పర్యటించి చర్యలు తీసుకోవాల్సిన టౌన్ ప్లానింగ్ అధికారి కార్యాలయానికి వచ్చి మొహం చూపించి వెళితే పట్టణం ఎలా అభివృద్ధి చెందుతుంది అంటూ విమర్శలు వినిపిస్తున్నాయి. కేవలం చుట్టపు చూపుగా వచ్చి వెళ్ళుతుండడంతో పట్టణంలో టౌన్ ప్లానింగ్ పాలన గాడి తప్పిందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇన్చార్జి బాధ్యతల వల్ల ఎక్కడ న్యాయం చేయలేకపోతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. పట్టణంలో పర్యవేక్షించేవారు లేక అక్రమ కట్టడాలు జోరుగా సాగుతున్నాయి అన్న విమర్శలు ఉన్నాయి.

**అరుణ గోదాంను ఆపేదెవరు**

ఎల్లంపల్లి మున్సిపల్ పరిధిలో భారీ ఎత్తున ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణం చేపడుతున్న అరుణా గోదామును ఆపేదెవరు అంటూ ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. అక్రమంగా చేపడుతున్న ఈ గోదాం ను అడ్డుకోవాల్సిన టౌన్ ప్లానింగ్ అధికారి మున్సిపాలిటీకి ఒకరోజు చుట్టపు చూపుగా వచ్చి మొహం చూపించి వెళుతుండడం వల్ల అక్రమ నిర్మాణదారులకు ఎలాంటి భయం లేకుండా యదేచ్ఛగా అక్రమ నిర్మాణాలు కట్టుకుంటూ వెళ్తున్నారు. అక్కడ కమిషనర్ ఉన్న అక్రమంగా నిర్మిస్తున్న అరుణ గోదాం వైపు కన్నెత్తి చూడరు. నోటీసులు ఇచ్చామని కమిషనర్ చెబుతున్న నిర్మాణ పనులు మాత్రం చక చక సాగిపోతున్నాయి.

**పూర్తిస్థాయి టిపిఓ ను నియమించండి**

పట్టణంలో సాగుతున్న అక్రమ నిర్మాణాలను అరికట్టాలంటే పూర్తిస్థాయి టిపిఓ ను నియమిస్తేనే అక్రమ నిర్మాణాలకు బ్రేక్ పడతాయని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. కొత్తగా ఏర్పాటు చేసిన ఎల్లంపేట మున్సిపాలిటీకి సరిపడా సిబ్బందిని కేటాయించకపోవడం వల్ల ఎల్లంపేటలో పాలన గాడి తప్పుతుందన్న విమర్శ వినిపిస్తున్నాయి.



## చిలకలగూడలో బక్రీద్ ఏర్పాట్లపై పోలీసుల సమీక్ష

సికింద్రాబాద్, ఏప్రిల్ 22 (మనం న్యూస్) రాబోయే బక్రీద్ పండుగను శాంతియుతంగా నిర్వహించేందుకు చిలకలగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం సాయంత్రం సమావేశం జరిగింది. ఇన్స్పెక్టర్ వలిశెట్టి రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో మస్జిద్ కమిటీ సభ్యులు, మాంసం దుకాణాల యజమానులు పాల్గొన్నారు. పండుగ సందర్భంగా పరిశుభ్రత, ట్రాఫిక్ నియంత్రణ, చట్టాల అమలు వంటి అంశాలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని ఇన్స్పెక్టర్ సూచించారు. ప్రజలందరూ పోలీసులకు సహకరించి శాంతి, సామరస్యం కాపాడాలని కోరారు. సమావేశం అనంతరం కమిటీ సభ్యులు ఇన్స్పెక్టర్ను సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.

## సికింద్రాబాద్లో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం కలకలం

సికింద్రాబాద్, ఏప్రిల్ 22 (మనం న్యూస్) సికింద్రాబాద్లోని సంజీవయ్య పార్క్-జేమ్స్ స్ట్రీట్ రైల్వే స్టేషన్ల మధ్య రైలు పట్టాల పక్కన గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభించడం కలకలం రేపింది. బుధవారం ఉదయం సుమారు 9:50 గంటలకు సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. సుమారు 40-45 ఏళ్ల వయస్సు గల ఈ వ్యక్తి మృతదేహం కంప చెట్ల మధ్య పడివుండగా, తల వెనుక భాగం కాలువలోకి ఉండడం గుర్తించారు. మృతుడి శరీరంపై బట్టలు సరిగా లేకుండా మృతదేహం కుళ్లిన స్థితిలో ఉంది. గుర్తింపు కోసం ఎటువంటి ఆధారాలు లభించలేదని పోలీసులు తెలిపారు. ఎవరైనా గుర్తిస్తే సికింద్రాబాద్ రైల్వే పోలీసులను లేదా దర్యాప్తు అధికారి ఎస్త్రై మాధవ్ ను ఈ నెంబర్లను 8712658623, 8712658581 సంప్రదించాలని కోరారు.

## ఘట్కేసర్-బిబినగర్ మధ్య గుర్తు తెలియని వ్యక్తి మృతి

సికింద్రాబాద్, ఏప్రిల్ 22 (మనం న్యూస్) సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ పరిధిలో బుధవారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం కనుగొన్నారు. డిప్యూటీ స్టేషన్ సూపరింటెండెంట్ సమాచారంతో, ఘట్కేసర్-బిబినగర్ మధ్య డౌన్ లైన్ వద్ద ప్రాంతంలో సుమారు 45-50 సంవత్సరాల వయస్సు గల వ్యక్తి రైలు కింద పడి మృతి చెందినట్లు గుర్తించారు. సికింద్రాబాద్ జీఆర్పీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతుడు లైట్ బ్లూ షర్ట్, లుంగీ ధరించి ఉండగా, ఎత్తు సుమారు 5.5 అడుగులు, గోధుమ వర్ణం, పొట్టపై మచ్చ ఉన్నట్లు తెలిపారు. ఈ వ్యక్తి వివరాలు తెలిసిన వారు 9440083160, 8712658581 నంబర్లకు సమాచారం అందించాలని రైల్వే పోలీసులు కోరారు.



## వృద్ధుడికి అండగా నిలిచిన చిలకలగూడ పోలీసులు

సికింద్రాబాద్, ఏప్రిల్ 22 (మనం న్యూస్) చిలకలగూడ పోలీస్ స్టేషన్కు ఇన్స్పెక్టర్ వలిశెట్టి రామకృష్ణ మానవత్వాన్ని చాటారు. గాంధీ ఆసుపత్రి పరిసరాల్లో తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న సుబ్రహ్మణ్యం (70) అనే వృద్ధుడిని గుర్తించారు. వివరాలు అడగగా, తాను అనాథనని, చూసుకునే వారు ఎవరూ లేరని వృద్ధుడు తెలిపాడు. దీనిపై స్పందించిన ఇన్స్పెక్టర్ రామకృష్ణ వెంటనే చర్యలు తీసుకుని, హెడ్ కానిస్టేబుల్ పి. శ్రీనివాస్ సహకారంతో వృద్ధుడిని సురక్షితంగా ఓల్ ఏజ్ హోంకు తరలించారు. ఈ మానవతా చర్యకు స్థానికంగా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజల రక్షణతో పాటు అవసరంలో ఉన్నవారికి అండగా నిలవడం కూడా పోలీసుల బాధ్యతేనని ఈ సంఘటన మరోసారి చాటిచెప్పింది.

## రాగి అంబలి పంపిణీ చేసిన విశ్రాంత ప్రధానోపాధ్యాయులు ఏ సత్యనారాయణ గౌడ్

(తలకొండపల్లి ఏప్రిల్22/మనం న్యూస్): వెల్జాల్ చలివేంద్రం దగ్గర రాగి అంబలి పంపిణి మానవసేవ యే మాధవసేవ అంటూ వెంకటాపూర్ గ్రామ విశ్రాంత ప్రధాన ఉపాధ్యాయులు అయిల్ సత్యనారాయణ గౌడ్ ఆధ్వర్యంలో రాగి అంబలి పంపిణి తలకొండపల్లి మండల పరిధిలోని వెల్జాల్ గ్రామంలోని ప్రధాన రహదారిపై తిరుమణి రాఘవేందర్ గౌడ్ ఏర్పాటు చేసిన చలివేంద్రం దగ్గర తలకొండపల్లి మండలం వెంకటపూర్ విశ్రాంత ప్రధానోపాధ్యాయులు ఏ. సత్యనారాయణ గౌడ్

ఆధ్వర్యంలో వేసవి కాలం ప్రజల దాహార్తి తీర్చడానికి బాటసారిలకు వాహనం దారులకు రాగి అంబలి పంపిణి అందజేయడం జరిగింది.ఈ సందర్భంగా సత్యనారాయణ గౌడ్ కుమారుడు శ్రీకాంత్ గౌడ్ మాట్లాడుతూ.... వెల్జాల్ గ్రామంలో చలివేంద్రం ఏర్పాటు చేసిన రాఘవేంద్ర గౌడ్ కు ప్రత్యేక ధన్యవాదాలు వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రజల దహార్తిని తీర్చడానికి మంచి మనసుతో ఏర్పాటుచేసిన చలివేంద్రం ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందని గ్రామంలోని ఎస్ బి ఐ బ్యాంకు దగ్గరికి వచ్చిన ప్రజలు చల్లటి నీరు,మజ్జిగా,అంబలి తాగి వారి దాహార్తిని తీర్చుకుంటున్నారు.గ్రామంలో ప్రజా అవసరాలను తీర్చడమే లక్ష్యంగా ఇలాంటి కార్యక్రమాలు మరెన్నో చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో వెంకటాపూర్ మాజీ సర్పంచ్ పి రమేష్ యాదవ్, మాజీ ఉపసర్పంచ్ బి నర్సింలు, అజీజ్, మండల కాంగ్రెస్ మైనారిటీ సెల్ అధ్యక్షులు ఎండి .ఆరీఫ్,ఏ. శ్రీకాంత్ గౌడ్ ,టి కృష్ణయ్య గౌడ్ , టీ రాఘవేందర్ గౌడ్, గొర్రె చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.





# పేదవాడి చెంతకు 'పట్నం' వైద్యం!

**రేగడి ఘనాపూర్లో ఉచిత వైద్య శిబిరానికి భారీ స్పందన**
**పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందుల పంపిణీ**
**జిల్లా మహిళా సర్పంచ్ల సంఘం అధ్యక్షురాలు మాధవి.**

చేవెళ్ల, ఏప్రిల్ 22 ( మనం న్యూస్): గ్రామీణ ప్రాంత ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని చేరువ చేయాలనే సంకల్పంతో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి అపూర్వ స్పందన లభించింది. బుధవారం రేగడి ఘనాపూర్ గ్రామంలో డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు.

ఈ కార్యక్రమాన్ని రంగారెడ్డి జిల్లా మహిళా సర్పంచ్ల సంఘం అధ్యక్షురాలు, గ్రామ సర్పంచ్ తిప్పని మాధవి రాంరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆర్థిక స్థోమత లేక వైద్యానికి దూరమవుతున్న పేదలకు ఈ శిబిరం ఎంతో మేలు చేస్తుందని కొనియాడారు. పట్నం మహేందర్ రెడ్డి హాస్పిటల్ యాజమాన్యం సామాజిక బాధ్యతతో ఇలాంటి శిబిరాలు నిర్వహించడం అభినందనీయమన్నారు.

నిపుణులైన వైద్య బృందం గ్రామస్థులకు జనరల్ మెడిసిన్, గైనకాలజీ, ఆర్థోపెడిక్ వంటి పలు విభాగాల్లో పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఈదులపల్లి మహేశ్వరి రాములు, గ్రామ పంచాయతీ సభ్యులు, ఆసుపత్రి వైద్య సిబ్బంది మరియు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




# జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో ఎస్ఆర్ జూనియర్ కాలేజ్ ప్రభంజనం

మేడ్చల్, ఏప్రిల్ 22 ( మనం జిల్లా ప్రతినిధి): జేఈఈ మెయిన్స్ 2026 ఫలితాల్లో ఎస్ఆర్ జూనియర్ కాలేజ్ ప్రభంజనం సృష్టించిందనిఛఆ కళాశాల ప్రిన్సిపల్ తెలిపారు. ఎస్ ఆర్ కళాశాల విద్యార్థులు జాతీయస్థాయిలో అత్యుత్తమ ర్యాంకులు సాధించారని తెలిపారు. నాణ్యమైన శిక్షణ క్రమశిక్షణనే ఈ విజయం కారణమని ఆయన తెలిపారు. పి శ్రీ చరణ్ 1 ర్యాంక్, డి త్రిశల్ 42వ ర్యాంకు, ఎన్. మైత్రేయి 45వ ర్యాంకు, ఎల్ దివిజ జ్యోతిర్మయ్ 142వ ర్యాంకు, ఎం శ్రీధర్ 162 వ ర్యాంకు, కే ప్రణయ కుమార్ 178వ ర్యాంకు జి. యువన్ చంద్ర 179 ర్యాంకు డి. ఇషాక్ 188 వ ర్యాంకు బి సందీప్ 203వ ర్యాంకు, ఎల్. సాయి దీపక్ 25వ ర్యాంకు సాధించారని ఆయన తెలిపారు.

# రంగారెడ్డి జిల్లా జూడో అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

**జూడో క్రీడాభివృద్ధికి కట్టుబాటు-రాష్ట్ర తలమానికంగా జిల్లాను ఇలా పెట్టి దిశగా నూతన కమిటీ ప్రతిజ్ఞ.**






(మనం న్యూస్ ఏప్రిల్ 22) మేడిపల్లి రిపోర్టర్: రంగారెడ్డి జిల్లా జూడో అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. తెలంగాణ జూడో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కైలాష్ యాదవ్, ప్రధాన కార్యదర్శి అజీజ్ పర్యవేక్షణలో ఫిర్యాదిగూడలో జిల్లా కార్యవర్గ ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో రంగారెడ్డి జిల్లా చైర్మన్ గా రమేశ్ గౌడ్, అధ్యక్షుడిగా అలీ, ప్రధాన కార్యదర్శిగా రాము, కోశాధికారిగా రవీన తదితరులను ఎన్నుకున్నారు. వీరితోపాటు ఉపాధ్యక్షులు సంయుక్త కార్యదర్శులు కార్యవర్గ సభ్యులతో కలిసి మొత్తం 23 మంది సభ్యులతో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తెలంగాణ జూడో అసోసియేషన్ నియమ నిబంధనల ప్రకారం రాష్ట్ర అధ్యక్షులు. కైలాష్ యాదవ్ . .మాట్లాడుతూ ప్రతి నాలుగు సంవత్సరాలకు ఒకసారి జిల్లా జూడో అసోసియేషన్ ఎన్నికలు నిర్వహించడం సంప్రదాయంగా జరుగుతుందని తెలిపారు. ఈ ప్రక్రియ ద్వారా కొత్త నాయకత్వానికి అవకాశం లభించి, క్రీడాభివృద్ధికి కొత్త దిశా నిర్దేశం జరుగుతుందని వారు పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లా జూడో అసోసియేషన్ ఇప్పటికే రాష్ట్ర స్థాయిలో ఒక ప్రత్యేక గుర్తింపు సాధించిందని, జిల్లాకు చెందిన క్రీడాకారులు సబ్-జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాల్లో అనేకసార్లు ఛాంపియన్షిప్లు సాధించి రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచారని వారు అన్నారు.

జిల్లాలో జూడో క్రీడ పట్ల ఆసక్తి రోజురోజుకూ పెరుగుతోందని, గ్రామీణ స్థాయిలోనూ క్రీడాకారులు ముందుకు వస్తున్నారని వారు పేర్కొన్నారు. సరైన మార్గదర్శకత్వం, శిక్షణ, ప్రోత్సాహం లభిస్తే రంగారెడ్డి జిల్లా దేశ స్థాయిలో కూడా ప్రతిభ కనబరచగలదని వారు విశ్వాసం వ్యక్తం చేశారు. కొత్త కమిటీ ఈ దిశగా మరింత కృషి చేయాలని సూచించారు.

ఈ ఎన్నికల్లో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం ప్రత్యేక విశేషంగా నిలిచింది. ఇది సభ్యుల మధ్య ఐక్యతను, పరస్పర విశ్వాసాన్ని ప్రతిబింబిస్తుందని అతిథులు అభినందించారు. నూతనంగా ఎన్నికైన కమిటీ 2026 నుండి 2030 వరకు నాలుగు సంవత్సరాలపాటు తమ పదవీకాలాన్ని నిర్వహించనుంది.

నూతన కమిటీ సభ్యులు ఈ విధంగా ఉన్నారు:

చైర్మన్గా గుర్రం రమేష్ గౌడ్, అధ్యక్షుడిగా మెహది అలీ ఖాన్, ప్రధాన కార్యదర్శిగా చందనగిరి రాము, కోశాధికారిగా నాగవెల్లి రవీనా బాధ్యతలు స్వీకరించారు. ఉపాధ్యక్షులుగా జే. రాఘవేంద్రరావు, టి. హరినాథ్, హరి కిషన్, ఏ. రవికుమార్, మొహమ్మద్ అలీ ఎన్నికయ్యారు. సంయుక్త కార్యదర్శులుగా పి. కోటేశ్వర్, ఓమర్ ఖాన్, టి. అంబికా రాణి, సయ్యద్ రసూల్ బాధ్యతలు చేపట్టారు. కార్యవర్గ సభ్యులుగా ఆర్. వికాస్ రెడ్డి, బి. కళ్యాణ్ గౌడ్, ఎం. ప్రవళిక, ఏ. సంగీత, పి. మధుకర్, ఆర్. సాయి ప్రకాష్, వి. ఉష, టి. శివకుమార్, రమేష్ ఎన్నికయ్యారు.

ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయిలో జరగబోయే పోటీలకు సంబంధించిన వివరాలను కూడా ప్రకటించారు. జూలై నెలలో సబ్ జూనియర్ విభాగం, సెప్టెంబర్లో జూనియర్ విభాగం, డిసెంబర్లో సీనియర్ విభాగానికి సంబంధించిన జిల్లా స్థాయి ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పోటీల ద్వారా ప్రతిభావంతులైన క్రీడాకారులను ఎంపిక చేసి రాష్ట్ర స్థాయికి పంపనున్నట్లు వెల్లడించారు.

ఈ సమావేశంలో జూడో అసోసియేషన్ రాష్ట్ర ప్రతినిధులు సంతోష్ కుమార్ సైదులు వల్లెం సుధాకర్, ల్యాదెల్ల సంపత్, శ్రీకాంత్, వినయ్, బాలు, నిశాంత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ సమ్మెకు బీఆర్ఎస్ నేతల మద్దతు



(మనం న్యూస్ ఏప్రిల్ 22) మేడిపల్లి రిపోర్టర్: ఆర్టీసీ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమవ్వడంతో కార్మిక జేఏసీ సమ్మెకు పిలునిచ్చిన నేపథ్యంలో మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పీర్జాదిగూడ డివిజన్ పరిధిలోని ఉప్పల్ బస్ డిపో వద్ద ఆర్టీసీ కార్మికులకు సంఘీభావంగా మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి మద్దతు తెలిపారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో ఆర్టీసీ సమస్యల పరిష్కారానికి పలు కీలక చర్యలు తీసుకున్నారని గుర్తు చేశారు. సంస్థ బలోపేతానికి ఆర్థిక సహాయం అందించడం, ఉద్యోగుల జీతాల పెంపు, పెండింగ్ సమస్యల పరిష్కారం, కొత్త బస్సుల కొనుగోలు, డిపోల అభివృద్ధి వంటి చర్యలతో ఆర్టీసీని కాపాడారని తెలిపారు.

ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం కార్మికుల సమస్యలను పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తోందని వారు విమర్శించారు. వెంటనే ఆర్టీసీ ఉద్యోగులతో చర్చలు జరిపి, వారి డిమాండ్లను నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు దొంతిరి హరిశంకర్ రెడ్డి, కొడే పోచయ్య, సీనియర్ నాయకులు లేతాకుల రఘుపతి రెడ్డి, మహిళా అధ్యక్షురాలు నిర్మల, ఆకుల మధుకర్, కందుకూరి ఆంజనేయులు, బుల్లెట్ శంకర్, అశోక్ రెడ్డి, సతీష్, శ్రీ రాములు గౌడ్, అశోక్, కిరణ్ నాయక్, పాశం నరేందర్ గౌడ్, శ్రీకాంత్, అమర్ పటేల్, జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

# ఎంఎంసీలో 98 మంది నిరాశ్రయుల గుర్తింపు




మేడ్చల్, ఏప్రిల్ 22 ( మనం జిల్లా ప్రతినిధి): మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 99 రోజుల కార్యాచరణ - ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా బిక్షాటన చేసేవారు, నిరాశ్రయులను గుర్తించే కార్యక్రమాన్ని చేపట్టారు. ఎంఎంసీ పరిధిలోని ప్రధాన రహదారులు, జంక్షన్లు, పబ్లిక్ ప్రదేశాలలో మొత్తం 98 మంది బిక్షాటన చేసేవారు, నిరాశ్రయులను గుర్తించారు. ఈ కార్యక్రమాన్ని యూసీడీ అధికారుల సమన్వయంతో నిర్వహించగా, గుర్తించిన వారందరికీ తక్షణ ఉపశమనంగా భోజనం, మంచినీటి వసతి, అవసరమైన సహాయ సహకారాలు అందించారు. అనంతరం వారిని మున్సిపల్ పరిధిలోని నైట్ షెల్టర్లకు తరలించే ప్రక్రియ చేపట్టారు. కొందరు తమ స్వగృహాలకు వెళ్లేందుకు ఆసక్తి చూపగా, వారికి తగిన సూచనలు చేసి స్వస్థలాలకు పంపేందుకు చర్యలు చేపట్టారు. మిగిలిన నిరాశ్రయులను నైట్ షెల్టర్లకు తరలించి ఆశ్రయం కల్పించారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, రోడ్లపై జీవనం సాగిస్తున్న నిరాశ్రయులకు భద్రత, ఆహారం, ఆశ్రయం కల్పించడం ద్వారా వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచడం ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ప్రజా పాలనలో భాగంగా బిక్షాటన నిర్మూలన, నిరాశ్రయుల పునరావాసం కోసం ఇలాంటి కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని పేర్కొన్నారు.

